గుండె నిండిన వేళ

తనచుట్టూ నించున్న వారి వైపు చూసింది రుక్మిణీదేవి.

అందరి ముఖాల్లో ఆందోళన, దుఃఖ వీచికలు, గుండెని రెండుగా కోసేస్తోన్నట్టు పడుతోన్న ఆందోళన

"రుక్కూ!" మంచంపై కూర్చుంటూ పిలిచాడు పరమశివం ముప్పై సంవత్సరాలు కలిసి చేసిన దాంపత్య స్నేహ పరిమళం ఆకంఠంలో ధ్వనించింది వియోగవేళలో పలికే అపశ్రుతిలోని విషాదం మనస్సుని కదిలించింది. ఎదలోపల సన్నని సితారాధ్వని లాంటి దుఃఖ సంగీతం.

కానీ పిలుపుకోసం ఎదురుచూస్తున్న రుక్మిణి మనస్సు ఆపిలుపుకి స్పందించ లేదు. ఆమె కళ్లు మళ్ళీ ఓ మారు అందరినీ పరీక్షగా చూశాయి. తను కోరుకున్న ముఖం లేదు. తన మనస్సు ఎన్నుకున్న మనిషికనిపించలేదు. తన ఎద తపించే ఆ చూపు తన చూపుతో కలవటం లేదు. ఆమె కళ్లు మూసుకుంది.

గుండెల్లో ఏదో కదలిక. ఏవో జ్ఞాపకాలు.

"మినీ!"

కొండలు కోనలు అడవి సంగీతంతో ప్రతిధ్వనించినట్టు ఆ పిలుపుకి ఆమె శరీరంలోని రక్త రేణువులన్నీ ప్రేమతో తడిసిపోయాయి. 'ఉ' అంది జీవన సంగీతం పలికినట్టు.

ఆమెచేతిని మెల్లగా స్పృశించాడతను. సన్నజాజి తీగకి తొలిసారిగా మృదువుగా - ప్రేమగా నరాలన్నీ చిక్కువిడిన దారపు పోగుల్లాగా ప్రేమ ప్రవాహంతో నిండిపోయాయి.

"రఘూ!"

అద్దంలా ప్రతిబించే ఆమె హృదయం నించి వెలువడింది.

'ఎలా బ్రతుకుతున్నాం మనం శరీరం రెండుగా విడిపోయినట్టు - వీణ రెండు ముక్కలైనట్టు -'

అతని పెదాలపై ఆమె తలిరాకు జొంపం వంటి అంగుళి కదలాడింది. 'వద్దు-మనకి వియోగం లేదు- అలా అనద్దు' అతని తొడపై తల ఆన్చుతూ అంది. సింహాసనం పై విశ్రాంతి తీసుకున్నట్టుగా వుంది.

గుండె ప్రశాంతంగా వుంది రక్తం నెమ్మదిగా ప్రవహిస్తోంది. శరత్ కాలంలో తేరుకున్నజీవప్రవాహం లాగా వలపువాగు.

'ఎలా వుంది ఈరోజు కండిషన్'

ఆమె కళ్లు తెరిచింది మదిలో మెదిలే జ్ఞాపకాలు మళ్ళీ చెదిరాయి. డాక్టరు పరీక్ష చేస్తున్నాడు. పరమశివం ఆత్రంగా, ఆరాటంగా అడుగుతున్నాడు. చుట్టూ వున్న అందరి కళ్ళలో అదే భావం

'ప్చ్! అంతు పట్టటం లేదు. శరీరంలో ఏశక్తీ లేదు. ఏ క్షణంలోనే ఎన్నడో యీ గుండె ఆగిపోయి వుండాలి.కానీ ఏదో బలమైన శక్తి ఆపుతోంది. ఎవరి కోసమో ఈ ప్రాణాలు నిలిచి ఎదురు చూస్తున్నాయి. ఆమె యిష్టపడే వ్యక్తి ఎవరైనా రావాలి. అంతే! అంతదాకా యీ యాతన తప్పదు.'

డాక్టరుగారి మాటలు ఎవరికీ అర్థం కాలేదు.

పరమశివం గారి ముఖంలో నరాలు కదలీ కదలని చలనం. దవడ కండరం బిగిసీ బిగియకుండా ఆగింది.

ఆయనేం సమాధానం చెబుతారో అని 'ఆశగా' వుందామె ఆయన జవాబివ్వలేదు. ఆమె మళ్లీ కళ్లు మూసుకుంది.

'మినీ!'

'అలా పిలుస్తారేం! లోకంలో అంతా రుక్మిణిని రుక్కు అంటారు. దేవీ అంటారు. మీరేమిటిలా-'

'నా ప్రత్యేకమైన దేవతాహ్వానం - అనంతకోటి నామాల్లో ఒకటి కాదు-'

'ఎందుకింత ఆరాధన!'

'అది నాకేం తెలుసు - నిన్ను చూసిన తొలి క్షణంలోనే నీపాదాలకి వందనం చేశాను. నీ అందానికి అభినందన చెప్పాను. నీ ప్రేమ కాసారాల్లాటి కనులకి నీరాజనం పట్టాను.'

'అంతా మీ భావనలోని రమ్యత-'

'ఊహూఁ నీ గొప్పదనం - ఒక దేవత ఒక మనిషికోసం మానవ రూపంలో వచ్చింది. అనుగ్రహించింది. వలపు గ్రహించింది."

'మనం యిలా కలుసుకుంటామను కోలేదు. ఎన్నడూ యిలా తప్పిపోయిన ఆ జీవితనేస్తం కనబడతాడనుకోలేదు. ఋతువైపోయాక వర్షం వచ్చినట్టు."

"మినీ- అతని కంఠంలో ఎనలేని తృప్తి - నేను జీవితంలో తల్లి ప్రేమ ఎరగను - నిన్ను చూశాక జగన్మాతని దర్శించినట్టు అనుభూతి చెందాను - నీ లాలనలో తరించి -'

సిగ్గుతో తలవంచుకుందామె.

'మినీ - నాకు అక్క చెల్లెళ్లు లేరు. ఆరేడు జన్మలుగా సోదరప్రేమ తెలియని వ్యక్తికి అది లభించినట్లయింది. ఆ ప్రేమనంతా అలాగే వర్షించాలని వుంది.

ఆమె కళ్లు శరదాకాశంలో విరిసిన జాబిల్లి జంటలయ్యాయి.

"నాకు కూతురుంది. ఆమెని నీలా పెంచాలి. నీ ధైర్యం, నీ తెలివి, నీ ఆలోచన, అన్నీ నీలా-'

'వద్దు రఘూ - నా శాప జీవితం మాత్రం వద్దు-'

'మనం ఉత్తను స్నేహితులం నా కింతవరకూ యీ ఆత్మీయత ఎక్కడా లభ్యం కాలేదు. నీవు నా తల్లివి. నా చెల్లివి- నా దేవతవి - నాకూతురివి - నా సర్వస్వానివి-'

'నీ వే తల్లివి తండ్రివి........ నిజముగ స్వామీ-' మెత్తని కంఠంలో లోగొంతుకలో మధుర మధురంగా చదివింది-'

'అవును-'

"నాన్నా-"పరమశివం పిలిచాడు. రుక్మిణి ఊహలు మళ్ళీ చెదిరి పోయాయి. కళ్లు తెరిచింది.

తండ్రి పిలుపుకి మురళి దగ్గరగా వచ్చాడు. డాక్టర్ వెళ్ళిపోయాడు. కోడలు, మనవలు, మనవరాళ్ళు, కూతురు. అల్లుడు అంతా అవతలి గదికి వెళ్లిపోయారు. వారం రోజులుగా ఇదే జరుగుతోంది. సీరియస్‌గా వుందని టెలిగ్రాం యిచ్చాడు పరమశివం. అంతా వచ్చారు. అంతదాకా ఒక పూవులో రెండు దళాలపై విడివిడిగా వుండే బొమ్మల్లాగా అంతటి గృహంలో కలిసి వున్నా ఎవరికి వారుగా వున్నారిద్దరూ. ఇప్పుడు మళ్లీ జన సందోహం. బంధువుల కదలికలు, ఇల్లంతా సందడి.

'ఏమిటి నాన్నగారూ!

'టెలిగ్రాం యిస్తావా!'

'ఎవరికి నాన్నగారూ!'

పరమశివం భార్యవైపు చూశాడు. పాతిక సంవత్సరాలుగా చూసే చూపే అయిష్టత -కోపం - అసూయ ప్రతి బింబించే చూపులు. రుక్మిణీదేవి కళ్ళల్లో ఆ భావాలని చదివిన పరిచయం.

'అతనికే - రాఘవరావు - ఎస్టేట్ ఆఫీసర్........'

మురళి- ముఖంలో కండరాలు కదిలాయి. అదే అయిష్టత అదే కోపం అదే అసూయ. అచ్చం పరమశివం ప్రతిబింబం మురళి రూపులోనే కాదు మనస్సులోనూ ఈ కుటుంబం ఇంతే అనుకుందామె.

ఆమె కళ్లు మూసుకపోయాయి.

'లోకం ఏమనుకుంటుంది?"

'లోకం ఏం అనుకోదు. దానికేం తెలుసు?"

'మినీ - నాతో వచ్చేస్తావా?' ఇంట్లో శతాబ్దాలుగా ఖాళీగా వున్న పూజా మందిరంలో దేవీ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవాలని తపస్సు చేస్తూ ఫలించి కోరిక కోరినట్టుగా అడిగాడు.

"ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నానో- మీకు దూరమై యీ బ్రతుకు లాక్కొస్తున్నాను. వద్దు, మళ్ళీ ఒకరికి అన్యాయం చేసి పాపం మూటకట్టుకోనా?'

నిట్టూర్చాడు అతను

'రఘూ! నా దొక్కటే కోరిక - చివరి ఘడియల్లో నీ ఒడిలో తలదాచుకుని నీ కళ్ళలోకి చూస్తూ నా చూపులు నీ చూపులతో కలిసిపోయి ప్రాణం ఆవిరైపోవాలి. అప్పటికి ఇద్దరికి వయసైపోయి వుంటుంది. మనవాళ్ళకి ఎవరికీ అనుమానాలు వుండవు. విషపుచూపులు చూడరు.'

'మినీ- ఎక్కడున్నా ఎలా వున్నా యీ నీ కోరిక తీరుస్తాను. బ్రతుకు పంచుకోలేక "పోయినా చావునయినా పంచుకుందాం."

'రఘూ! యీ మాట నిలుపుకోవాలి.'

పద్మదళంలాంటి ఆమె చేతిలో చేయివేశాడు.'

'ఎన్ని జన్మల బంధం ఇది'

'మనకి వియోగం ఎక్కడిది మినీ- అతనో క్షణం ఆగేడు. "నీవులేని ఊహ లేదు. నిన్ను ఊహించని క్షణం లేదు. ప్రతిదానికీ నీ తీపి తలపు. ఎంత పోగొట్టుకున్నాను. తెలిసిన బాధ. అయినా ఈ మనస్సు - ఈ మమత - ఈ గుండె చప్పుడు నాదే అన్నతృప్తి రాక్షసులతో జీవిస్తోన్నా దేవతాభావన అనురమవుతున్నది.'

'చాలు రఘూ"

'టెలిగ్రాం యిచ్చివస్తాను' మురళి పాదాలు కఠినంగా నేలని తాకుతూ కదులుతున్న శబ్దానికి కళ్లు విప్పింది రుక్మిణి.

"రుక్కూ!'

ఏ భావమూ ప్రకటించని చూపు పాలికేళ్లుగా అలాగే చూస్తోంది. ఎన్నడూ అసంతృప్తి ప్రకటించలేదు. కానీ ఆ మనిషికి తృప్తిలేదని తెలుసు. దేనికీ అడ్డు చెప్పలేదు. కానీ దేన్లోనూ యిష్టంలేదని తెలుసు. శత్రువులు జీవితం పంచుకున్నట్టుగా బ్రతికారు ఇద్దరూ -ఇది ఎందరికి తెలుసు-'

"టెలిగ్రాం యివ్వటానికి మురళి వెళ్ళేడు-"

రుక్మిణి అదోలా చూసింది. నమ్మీ నమ్మని స్థితి.

"రాఘవ గారికి."

ఆమె కళ్లు మూసుకున్నది.

ఎదలో తీపి తలపులు...సంగీత ఝరులు...ప్రణయ సాగర సంగమ వేళలో పరుపులెత్తే నదీ కన్య పరవళ్లు.

"రాఘవా! ఇంత నిర్మోహమైన మోహం- ఇంత నిర్మలమైన ప్రేమ ఇంత నిస్వార్థమైన ఆరాధన -ఎన్ని జన్మల తపఃఫలితమో! నేను అదృష్టవంతురాలిని."

"మినీ!" అతని గొంతు ఆర్ద్రమైంది. "ఇది ....యిది........ ఒకరికి చెపితే తెలిసేది కాదు. వెన్నల చల్లదనం- పూల కమ్మదనం వలపుతీయదనం- ఇవన్నీ అనుభవ పరిమళాలు."

"రఘూ! నేను జాబ్ వదిలేస్తున్నాను.......నీకు ట్రాన్స్ఫర్ అవుతుంది కాదా!" ఆమె కంఠం రుద్ధమైంది. "మన వృత్తి అందరిలా కాదు. డెడికేటెడ్ గా లేకపోతే ఎన్నో ప్రాణాలు పోతాయి."

"మినీ!" అతని కంఠం రుద్ధమైంది. "నా వల్ల ఎన్ని బాధలు-"

అతని మాటలు పూర్తి కాలేదు. ఆమె దీనంగా చూసింది. "ఇది బాధా. నాకు ఈ జన్మలో భగవంతుడు ప్రసాదించిన వరం ! నిన్ను చూసేదాకా నేనేం పోగొట్టుకున్నానో తెలీలేదు. నిన్ను చూశాకా నా కెంత సౌభాగ్యం దక్కిందో తెలుసుకున్నాను. రఘూ మనల్ని లోకం కొలతలో కొలవద్దు. వేయి వాకిళ్లు తెరుచుకొని గుండె ఎదురుచూసింది. నీ కొలువు కోసం. శతపత్రాల్లాగా యీ కళ్లు విరిసేది నీ చూపు కోసం...అంతే!"

"మినీ-" ఆమె వైపు ఆర్తి ఆరాధన అనురాగం నిండె కళ్ళలో చూస్తూ అన్నాడు. "మళ్ళీ మనం ఎప్పుడు కలుసుకుంటామో! చివరి చూపులకోసం తప్పక వస్తాను. అంతదాకా నువ్వు యీ గుండెల్లో సజీవ మూర్తిగా వుంటావు మనకి వియోగం లేదు. విరహం లేదు."

"ఒక పాట"

"పాడు మినీ...ఎప్పుడూ నీ పాట నా చెవుల్లో చల్లని సంగీతం వినిపించేలా పాడు....."

అతని ఒడిలో శయనించింది ఆమె

ప్రశాంతమైన కాసారంలా వుంది మనసు. పదబంభరాలు మృదుపరిమళాలని వెదజల్లుతున్నట్టుగా అంతరంగ తరంగాలపై వలపు వాసనలు విరజిమ్ము తున్నట్టుగా పాడింది.

"మినీ-"

"రఘూ! ఇలా మరణించాలి నేను"

"రుక్మిణీ"

చప్పున కళ్ళు తెరిచింది. తపోభంగమైన యతిలా చూసింది. ఎదురుగా.....సోదరుడు....

"ఎలావుంది?"

జవాబు చెప్పలేదామె. ఆమె కళ్లలో నిరాశ........తాను ఎదురు చూస్తున్న రూపం కోసం నిరీక్షణ..........

✧ ✧ ✧

రెండు రోజులు గడిచాయి. లోగడ గడిచిన ఎన్నో రోజుల్లాగే డాక్టర్ వస్తున్నాడు. ఇంజక్షన్లు ఇస్తున్నాడు. మాత్రలు మింగిస్తున్నాడు. టానిక్కులు గొంతుద్వారా జారిపోతున్నాయి. పరిస్థితిలో మాత్రం మార్పులేదు. పరమ శివం, మురళి, సారధి, కోడలు, కూతురు, మనవలు,

మనవరాండ్రు అంతా ఎవరి ధోరణిలో వాళ్ళు.

కాఫీలు, టీలు- టిఫిన్లు భోజనాలు, నిద్రలు......చర్చలు.......

రుక్మిణీదేవి మాత్రం శ్రీరాముడి కోసం శబరిలా నిరీక్షిస్తోంది. ఆమె మనస్సు క్షణమే యుగమై వలపే నగమై బ్రతుకే సగమై అతని 'రాక' కోసం నిరీక్షిస్తోంది.

"వస్తాడు........తప్పక వస్తాడు........ఇన్నేళ్ళుగా ఆ రాక కోసం ఆ మనిషి కోసం ఆ మనసు కోసం ఎదురు చూస్తోంది తను పిలుపు అందటం లేదా! యీ టెలిగ్రాములూ, యీ ఉత్తరాలు, యీ ట్రంక్ కాల్స్ యివేవీ తమ మధ్య అక్కర్లేదు. మనస్సులో తను చేసే తపస్సు- తన పిలుపు - అవి చాలు.

తప్పక వస్తాడు......ఇన్నేళ్ళ యీ నిరీక్షణకి ఫలితం కావాలి.......అతని ఒడిలో శాశ్వతంగా శయనించాలి.....

వచ్చే జన్మలో యీ బంధాలు - యీ అడ్డు - యీ అవరోధం .....యివేవీ వుండవు. తను భగవంతుడితో పోరాడుతుంది. అతనికోసం అతని కోసమే జన్మిస్తుంది.....భావం, భాష, గీతం, సంగీతం; జీవం, జీవితం, మనువు మనసు కలిసేలా కలిసిపోతారు.

ఇదీ దాంపత్యమంటే - దంపతులంటే వీళ్ళు అన్నట్టుగా జీవిస్తారు. ఒక రూపం రెండు శరీరాలు అయినట్టుగా, ఒక ఆత్మ స్త్రీ పురుషులుగా జన్మించినట్టుగా కలిసి మెలిసి బ్రతుకుతారు.

తనకి పోలిక లేదు. వుండదు. వుండబోదు. రాము రామే - తను కలయికే కలయిక - తన జీవనమే జీవనం - తన ప్రేమే ప్రేమ.........

"రుక్కూ"

ఊహలు చెదిరిపోయాయి.

"ఎప్పుడూ యింతే" అనుకుందామె.

"అయి మాట - ఆయనే వారు" సూర్యబింబంవైపు ప్రొద్దుతిరుగుడు పువ్వు తిరిగినట్టు చప్పున మారిపోయినట్లేయి.

"రామూ" పెదాలు కదిలాయి.

"మనీ" పెదాలు అస్పష్టంగా కదిలాయి.

ఆమె చేయి చాచింది. చేయి కలిపాడు అతను. ఒక జన్మబంధమైన స్పర్శ......పరమ శీతలమైన స్పృహణీయమైన స్పర్శ.

ఇన్ని రోజులైనా నోట మాట లేదు. ఇప్పుడు స్పష్టంగా బాగా మాటాడుతోంది... మంచంపై కూర్చున్నాడు రాము. పరమశివం ముఖంలో గాయి పెట్టినట్టు...అతను తెల్లపోయాడు.

"రామూ! నీ మాట నిలుపుకున్నావు. నా చివరిక్షణాల్లో వస్తానని నా కిచ్చిన మాటకే కట్టుబడ్డావు. నా జన్మ ధన్యమైంది....ఇన్నాళ్ళూ ఈ ప్రాణాలు నీ కోసమే నిలిచాయి."

"మనీ" ఆమెను చూస్తూ పిలిచాడు. యాభై వసంతాలు గడిచిన శరీరం అయినా పాలకేళ్ల పరువం కనిపిస్తున్నది. తలలో ఒక వెంట్రుకైనా నెరవలేదు ముఖంలో ఒక ముడుతైనా లేదు. కళ్లు స్వచ్ఛంగా ప్రేమకాసారాల్లా పెదవులు అందులో పూచిన మందారాల్లా ఎలా నిలిచింది యిన్నేళ్లీ యవ్వనం...వయస్సు అక్కడే ఆగిపోయినట్టు - వంపు సితార జీవన గీతం పాడుతున్నట్టు.

"రఘూ" ఆమె పిలిచింది మళ్ళీ....."ఇన్నేళ్లు యీ బ్రతుకుతో రాజీపడ్డాను. ఆయన కోసం, కూతురి కోసం, కొడుకు కోసం బ్రతికేను. ఇపుడు నా కోసం మరణిస్తాను.....నా కోరిక కోసం కన్ను మూస్తాను......"

"మనీ" అడ్డు తగిలాడు అతను.....అంతలో పరమశివం, మురళి, ప్రేమ లోపలికి వచ్చారు. అతనలాగే కూర్చున్నాడు.

"శివా" భర్తని పిలిచిందామె. "ముప్పై సంవత్సరాలు నిన్నిలా పిలవ లేకపోయాను. అది నా తప్పుకాదు...నా మనస్సుని స్పందింప చేయలేని నీ దోషమది. మురళీ! నువ్వూ కన్నతల్లిని నన్ను బంధనాల్లో పెంచావు. ప్రేమ కూడా అంతే నన్ను అర్థం చేసుకోలేదు. నేనెవరూ నా మనస్సు విప్పలేదు. అందుకు మీరు అవకాశం కల్పించలేదు."

"రుక్కూ"

"అదిగో - ఆ పిలుపే నాకిష్టం లేదు. ఆ మాత్రం కూడా మీరు గ్రహించలేదు. ఎప్పుడూ మీకు మీ లా, మీ ప్రాక్టీసు - మీ క్లయింట్స్"

"చూశారా" రాఘవ వైపు చూసి అన్నాడు పరమశివం "నేను ఆమె దృష్టిలో దోషిని"

"ఊరు - నా మనస్సుని చంపిన హంతకులు"

'అమ్మా'

"మీకు తెలియదు- మీరేం చేశారో- భర్తని, కన్నవాళ్ళని ప్రేమించలేక పోయాను - అదృష్టం కొద్దీ ద్వేషించలేదు- ఏ స్పందన లేకుండా జీవించాను'

"చూశారా! ఎలా మాట్లాడుతుందో ఇప్పుడు నన్ను - నన్ను దోషిని చేస్తున్నది......"

"అది సంధి ప్రేలాపన నాన్నా!"

మురళి మాటలకే నవ్విందామె.

"అదిగో- మీ స్థాయి అది. అంతే!"

"సర్" పిలిచాడు రాఘవ "ఆమె ఒక రసమయి - ఒక రాగవాహిని - ఒక ప్రేమమూర్తి - ఆమె మనస్సు రసగంగాధరం"

"ఒట్టి శృంగారమయం."

"అవును అలంకారమయం"

"ఊహూఁ అలంకార ప్రాయం"

ఆమె పెదాలు విచ్చుకున్నాయి.

"రఘూ! ఆయనతో మాట్లాడకు - ఆయన స్థాయి అంతే నేను ప్రయత్నించీ మార్చలేకపోయాను. సాధ్యం కాలేదు. నీవు వాదనతో మార్చగలవా!

ఊషర క్షేత్రంలో పన్నీరు కురిసినా కన్నీరు కురిసినా వ్యర్థమే"

రాఘవ మాట్లాడలేదు.

"రాఘవగారూ! ఇంతకంటే ఘోరం వుంటుందా."

"పరమశివంగారూ! ఒక జీవిత కాలం గడిచిపోయింది. ఆమె మనసు నిత్యాగ్నిగోళంలా దహించుకుపోయింది. పోన్విండి. ఈ చివరి ఘడియలో నయినా ఆమెని ప్రశాంతంగా వెళ్ళిపోనివ్వండి"

పరమశివం మాట్లాడలేదు. భార్యవైపు చూశాడు.

అదే సమయంలో రాఘవ అటు చూశాడు. అతనికి ఒక మహారాణి మరణశయ్యపై వున్నట్టు అనిపించింది. ఒక దేవతామూర్తి అవతారం చాలించబోతున్నట్టుగా వుంది ఎంత వారికైనా మరణం తప్పదు. అయినా మరణం లోనూ ఇంత హుందాతనమా?

"రఘూ!"

అతనామె దగ్గరికి వెళ్లేడు.

"కూర్చో"

మంచంపై ఆమె తలవైపు దగ్గరగా కూర్చున్నాడు.

"ఇలా జరుగు- దగ్గరగా రా!"

అతని ఒడిలో తల పెట్టుకున్నది. సింహాసనంపై కూర్చున్న అనుభూతి ఆమె ముఖంలో కనిపించింది"

"నాకు పాడాలనిపిస్తోంది?"

అతనామెనే దీక్షగా చూస్తున్నాడు.

"రఘూ! యీ సంఘం కట్టుబాట్లతో మనం దూరంగా బ్రతికేం . ఈరోజు ఈ జీవితానికి ఆఖరి రోజు. మళ్ళీ పరిగెత్తే రేపటి జీవితయానంలో నీ తోడు కావాలి. నీ నీడ కావాలి.నువ్వు జోడుకావాలి......."

"మినీ -" ప్రేమగా పిలిచాడు. 'భగవంతుడు ఎంతో దయామూర్తి - ఆయన కోరిక తీర్చాడు. తీరుస్తాడు."

"మరుగేలరా ఓ రాఘవా!"

ఆమె పెదాలు విచ్చుకున్నాయి. గుండె వేణుగానం పాడుతున్నది. వలపు వసంతమైంది. మధుర మధుమాసమైంది.

"అన్ని నీ వనుచు నే అంతరంగ మున - నిన్నెగాని మదిని ఎన్నజాల నొరుల"

స్వరాలన్నీ శృతులై పాడుతున్నాయి.

"మరుగేలరా ఓ రాఘవా!"

"మినీ!"

"రాఘవా!"

ఆమె చూపులు అతని చూపులతో లయించాయి. అతని ఊపిరిలో ఆమె ఊపిరి కలిసిపోయింది. అతని చేతిలో ఆమె చేయి కలిసిపోయింది.

ఆ చూపులు అలాగే నిలిచాయి.

ఆ ఊపిరి అలాగే నిలిచిపోయింది.

ఆ చేయి అలాగే బిగుసుకుంది.

అది ప్రకృతి ఓడిపోయిన క్షణం.

భగవంతుడు అనుగ్రహించిన క్షణం.

మనసా వాచా ఏకీకృతమైపోయిన రెండు ఆత్మలు కలసిన దాంపత్యం వెల్లివిరసిన మధుర క్షణం.

'రుక్మిణీ - పరమశివం గాబరాగా పిలిచాడు.

ఆమె ఆతని పిలుపు కందని దూరంలో పయనిస్తోంది.

'రఘూ!గారు' - తట్టి పిలిచాడు పరమశివం.

దబ్బున పడిపోయాడు. రాఘవ. అతను ఆమె కలిసి సుదూర తీరాల్లో పయనిస్తోన్నారు. ఇన్నేళ్లు కలిసి జీవించలేని, కలసి మాటాడకూడని, కలసి నడవలేని 'వాళ్లు' కలసి పయనిస్తున్నారు.

మురళి, ప్రేమ గొల్లుమన్నారు.

ఒకే క్షణంలో ప్రాణాలర్పించిన వాళ్ళ ప్రేమకి నిర్ఘాంతపోయాడు పరమశివం........ నివ్వెరపోయి నిల్చున్నాడు.

"ఎన్నినాళ్ళకీ బ్రతుకు పండెనో...' ఎక్కడో రేడియోలో మంద్రస్థాయిలో వినిపిస్తోంది....

● జ్యోతి మాసపత్రిక మే '83 ●